


# మా దాదీమా వాళ్ల నానమ్మ నడుమ బొమ్మ

మా నాయనమ్మకి మూడు వస్తవలంటే యిష్టం.

ఒకటి ఆమె సాహస్త్రాలతో కుట్టుకున్న మూడు పేటల బొంత. రెండు మా అటక మీద బద్రంగా అట్టిపెట్టుండే ఎర్రపూల ట్రంకుపెట్టె. మూడు పెండెంవోళ్ల అంగడికాణ్ణుంచి తెచ్చే పావలా ముక్కుపొడి పొట్లం.

రోజులో చెయ్యాల్సిన పనంతా చేసేశాక, మొకాన రొన్ని నీళ్లు జల్లుకొని, రెండు చిటి కెళ్ల ముక్కుపొడిని రెండు ముక్కుల నిండా పీల్చుకొని, దొడ్డి గడపకాడ బొంత పరుచు కొని, ట్రంకుపెట్టెలోని అరెబీ కతల పుస్తకాన్ని చేతుల్లోకి తీసుకొని నడుం వాల్చిందంటే యింక అటు లోకం యిటయ్యినా మా నాయనమ్మకి దిగులుండదు.

ఎండాకాలాలు ఇస్కూళ్లు లేక, ఎండలకి మద్యానాలు బయటికి వెళ్లలేక, యిళ్లల్లోనే దొరికిపోతాం గదా పిల్లలం అప్పుడు మా నాయనమ్మ పట్టేసుకుంటుంది మమ్మల్ని 'ఒరే.. కతలు చెబుతాను రండిరా' అంటా.

నాకు చిన్నప్పటి నుంచి కతలంటే యిష్టం గాబట్టి, టకామని పొయ్యి మా నాయ నమ్మ పక్కన చేరిపోయేవాణ్ణిగానీ మా అన్నకు ఆ యిష్టం గిష్టం ఏమీ లాకపోయినా వాడు



గూడా వచ్చి కూచునేవాడు దొంగబుద్ధితో.

ఏం దొంగబుద్ధిరా అనంటే మా నాయనమ్మ కొంగులో ఎప్పుడూ ఒక పావలా కాసు ఉంటుంది కట్టుకొని. అవి ముక్కుపొడి కోసరమని మా నాయనమ్మకు మా నాయన రోజూ ఇచ్చే పావలా డబ్బులు.

మా నాయన ఒక పూట పెద్దగోల్డ్‌ఫ్లాకు తాగకుండా చిన్నగోల్డ్‌ఫ్లాకు అయినా తాగతాడేమోగానీ మా నాయనమ్మకి ముక్కుపొడి డబ్బులు మాత్రం యియ్యకుండాపోడు. ఒకేల పొయ్యాడో మా నాయనమ్మ ఆయన పరువు తీసి రోడ్డున పెట్టేస్తుంది.

'ఒరే నాయనా జన్మనిచ్చిన తల్లికి ముక్కుపొడి కొనిపెట్టేలేనోడివి నీకెందుకురా తండ్రీ యింత పెద్ద సంసారం. అందరినీ తీసకెళ్లి ఆ మల్లారెడ్డి సత్రంలో పడెయ్యరా. మా బాదలు మేం పడి ఎట్టో బతకతాం. పాపం బిడ్డవి. నువు మాత్రం ఎంతకాలమని కష్టపడతా ఉంటావు' అంటుంది తుస్కారంగా.

అందుకని మా నాయన యిన్ని అవస్తలు పడైనా సరే మా నాయనమ్మకి పావలా యిచ్చేసేవాడు రోజూ. అట్టాంటి పావలా మీద మా అన్నకి కన్ను. దానిని నూకెయ్యాలని వాడి ప్లాను. అయితే మా నాయనమ్మ తడవకోసారి ఆ కొంగుముడిని తడుంకుంటా ఉంటుందిగదా, దొంగతనం జరిగిన మరు నిమిట్టులో ఆమెకి తెలిసిపోతుంది గదా అందుకని వాడు యమా డావు వేశాడు.

ఏమి డావురా అనంటే పావలా బిళ్ల ఎట్టా ఉంటుంది? అది ఇనపబిళ్ల. చిన్నది. గుండ్రంగుంటుంది. మరి ఇనప ఐదుపైసలబిళ్లో? అది గూడా చిన్నదే. పావలా బిళ్లంత ఉంటుంది. కాకపోతే నాలుగు పక్కలా నాలుగు మూలలు ఉంటాయి దానికి. ఇప్పుడు ఈ ఇనప ఐదుపైసల బిళ్లని బండరాయి మీద పెట్టి నాలుగు పక్కలా సాది గుండ్రంగా

చేస్తే? అచ్చంగా పావలా బిళ్ల అయిపోతుంది. బొరుసుపక్క గమనించి చూస్తే తప్ప అది నకిలీపావలా బిళ్ల అని కనిపెట్టడం కష్టం.

మా అన్న ఎంత తెలివైనోడంటే మహా మహా సాయిమహల్ బుకింగువాణ్ణే బోల్తా గొట్టించి, రెండు పావలా బిళ్లల మద్యన ఈ నకిలీ పావలాబిళ్ల కలిపేసి ముప్పావలా నేల టికెట్టు సంపాదించేవాడు. ఇట్టా ఈ పని చేసినోడికి మా నాయనమ్మ కొంగులోని ఒరిజినల్ బిళ్లని కొట్టేసి, డూప్లికేటు పెట్టడం ఒక లెక్కా?

వాడు కతలు యింటున్నట్టుగా ఊ కొడతా కొడతానే మా నాయనమ్మ కొంగుముడి యిప్పేసి స్మగ్లింగు పూర్తి చేసేసేవోడు. పాపం మా నాయనమ్మ తడవకొకసారి, ముడి తడుంకుంటా ఉందిలే ఉందిలే అనుకుంటా ఉండేది. అంతా అయ్యాక ఏముంది? ఖాళీ.

అందుకని మా నాయనమ్మ వాడి కంటే ఎక్కువగా నన్నే లైకు చేసి పక్కన కూచోబెట్టుకొని కతలు చెప్తా ఉండేది.

మా నాయనమ్మ లాగే మా మురళీవాళ్ల బామ్మకి కూడా మూడు వస్తువలంటే యిష్టం.

ఒకటి పొద్దన్నే పొడుగుస్టీలు గిలాసు నిండుగా గుడగుడమని తాగే కాఫీ.

రెండు మా మురళీ వాళ్ల తాత పిలవంగానే పలికి వెళ్లి చేసే సేవ.

మూడోది మా మురళీగాడు.

నేనంటే మా యింట్లో రెండోవాణ్ణి. నా తర్వాత ఒక చెల్లెలుంది. ఒక తమ్ముడున్నాడు. అందువల్ల పెద్దోళ్లు పిలకాయల్లో ఎవరితో ఒకరితో గారాలు పోవచ్చు, రావచ్చు.

కానీ మురళీవాళ్లింట్లో మురళీగాడు ఒకడే గాబట్టి వాడికే అన్నీ గారాలూ గారెలూ తీపులూ కారాలూ.

మా మురళీవాళ్ల తాతపూజారిగదా, ఆయనకి రోజూ కృష్ణుడిగుళ్లో అరటిపొండ్లు, పులిహోరలూ, దద్దోజనాలు ప్రసాదాలుగా నైవేద్యాలుగా అందతాయిగదా, అయన్నీ మూటగట్టి యింటికి తీసుకొస్తా ఉండేవాడాయన. ఇంక వాటిని యింట్లో ఎవ్వరూ తాకరు. అన్నీ మురళీగాడికే. వాడే చచ్చినట్టు వాటన్నింటినీ తినాలి.

'మా బంగారుకదూ. మా మురళీడు కదూ. మా కన్నయ్య కదూ' అని మా మురళీవాళ్ల బామ్మ మురళీగాణ్ణి చంకనెక్కించుకున్నంత పని చేసి వాటన్నింటిని వాడి గొంతులో కూరతా ఉండేది.

వాడు ఒక్కోసారి తినలాక, మింగలాక, కక్కలాక 'బామ్మ, బయట తింటానే' అని అయన్నీ తీసకొచ్చి నాకూ, కందుల మాలకొండరావుగాడికీ పెట్టి పీడా యిరగడయ్యిందన్నట్టుగా గాలిపీల్చుకునేవోడు.

సాంబ్రాణీకడ్డీలు గుచ్చిన గుర్తులున్న ఆ అరటిపళ్లను మేము మెక్కతా ఉంటే పాపం ఉండుండి కళ్లమ్మట నీళ్లు పెట్టుకునేవాడు.

'ఒరే. తినలాకపోతున్నానురా యియ్యన్నీ. మా బామ్మ బాదపడద్దనిగానీ' అనేవాడు చొక్కా ఎత్తి కళ్లు తుడుచుకుంటా.

మా నాయనమ్మ వల్ల మా యింట్లో ముక్కుపొడి బాద, మా మురళీవాళ్ల బామ్మ వల్ల మురళీగాడికి దద్దోజనం బాద ఉండొచ్చుగానీ ఈ యిద్దరు వల్ల మాకు వేరే ఏ బాదలూ

ఉండేయిగావు.

వాడు మా యింటికి వస్తే 'కూచోబా మురళీ. బాగా చదువుకోండి బా. మీ బామ్మ ఎట్లా ఉన్నాడ్?' అని మా నాయనమ్మ వచ్చీరాని తెలుగులో ప్రేమగా పలకరించేది. నేను వాళ్లింటికి పోతే 'ఒరే. కదీరుగాడు వచ్చాడు చూడు' అని మురళీ వాళ్ల బామ్మ నాకు పప్పు చెక్కలు లాంటియి పెట్టేది.

అయితే ఈ కత నలుగురిది గాబట్టి, ఇందులో కందుల మాలకొండరావుగాడికి అవ్వ లేదుగాబట్టి, కేతిరెడ్డి శ్రీదరురెడ్డికి నానమ్మ ఉందిగాబట్టి మనం ఆమె సంగతేందో తెలుసు కోవద్దా?

తెలుసుకోవాలనే నా కోరిక గూడా. అయితే ఆ మనిషి నన్ను యింట్లోకి రానిస్తే గదా.

గేటుకాడ ఉండంగానే 'ఎవురాడా?' అని కేకేసేది పెద్దగా. ఆ అరుపుకే సగం పని ఔటు. 'శి..శి.. శ్రీదరు'... అని అంటా ఉండగానే 'ఏందా?' అనేది మళ్లా యినబడనట్టు కావాలని.

యింకంతె. మనకు మాట వొచ్చేదిగాదు.

అయినాగానీ మొండిగా దైర్యం జేసి 'శ్రీదరు కావాలి' అన్నామా ఆ మనిషి యింతె త్తున లేచేది. 'ఎవుడివిరా నువ్వు. యాణ్ణుంచి వొచ్చావురా. ఏం పొంగులా. ఎంతకాడికి ఆటలూ ఆటలూ ఆటలేనా? పో పో పో మళ్లి రాబో' అనేది.

దాంతో మనం లగెత్తుతాం చూడూ... క్షణంలో యింటికాడ తేలతాం.

మా శ్రీదరు వాళ్ల నానమ్మను మనం తప్పించుకునేదానికి లా. ఏమంటే ఆ మనిషి ఎప్పుడు చూసినా వాళ్లింటి వరండాలోనే ఉండేది ఏదో ఒక పని చేసుకుంటా.

మా నాయనమ్మలాగానో, మురళీవాళ్ల బామ్మలాగానో ఎట్ట పడితే అట్ట ఉండకుండా ఆమె అమిత వైనంగా ఉండేది. మనిషి ఎర్రటి ఎరుపు. సాదా వాయిలు చీరలు గట్టుకొని ఉన్నా అమిత కళ మొకంలో. అంతా బాగానే ఉంటుందిగానీ గొంతు యిప్పితేనే ఎదుటి వాళ్లు పరార్.

నేనొచ్చినప్పుడల్లా శ్రీదరుగాడు యింట్లో నుంచి బయటికి రాలాక, యింట్లోనే ఉండ లాక, తొంగి తొంగి చూడ్డం వల్లగాక 'ఒరే. మా నానమ్మతో చాలా కష్టంరా. నువ్వు యింటికి రాబాకురా. మనం ఇస్కూల్లోనే కలుద్దామురా' అన్నాడు.

నాకు చాలా బాదేసింది ఆ మాటకి.

'ఒరే. మేము బీదోళ్లం మీరు డబ్బున్నోళ్లని గదరా ఈ డిఫరెన్సు?' అన్నాను మొకం చాలా యిదిగా పెట్టి.

'చ చ. అదేం గాదురా. కందుల మాలకొండరావుని రానిస్తున్నారుగదరా. వాళ్లు బీదోళ్లే గదరా. నువ్వు వాడిలాగా మెతగ్గా ఉండకుండా పొగురుగా అవుపిస్తావేమోరా. అందుకని ఇష్టం లేదేమోరా...' అన్నాడు వాడు నా తట్టు జాలిగా చూస్తా.

ఏం జెయ్యాలో నాకు పాలుబోలా.

రాను రాను శ్రీదరువాళ్ల నానమ్మ నాకు పెద్ద బాదగా తయారయ్యింది.

నేనేం పాపం చేశాను. నన్నెందుకు యింట్లోకి రానియ్యదు. అసలా మనిషి మా నాయ

నమ్మలాగానో, మురళీ వాళ్ల బామ్మలాగానో అమ్మలక్కలతో ఆ మాటలు యీ మాటలు చెప్పుకుంటా, హాయిగా నవ్వుకుంటా, తీరుబడిగా ఎందుకు అవుపించదు? అంత డబ్బున్నా పొద్దుగూకులా కష్టం చేస్తా ఉంటుంది దేనికి? అందరి మీద అజమాయిషి చేస్తా ఉంటుంది దేనికి?

అదే మాట మురళీవాళ్ల బామ్మని అడిగా.

'ఒరే ఏమనుకుంటున్నావురా ఆమెని? మహాతల్లిరా. పద్నాలుగేళ్ల వయసులో ఈత ముక్కల కాణ్ణుంచి వాళ్ల మేనమామని కట్టుకొని మన పాతూరులో అడుగుబెట్టింది. లంకంత యిల్లు. అలివిగాని బూములు. పాడీ. పశువు. చిన్నవయసు నుంచే వాటన్నింటినీ వైనంగా లాక్కొని వచ్చింది. వాళ్లింట్లో యాభై అరవై నాటుకోళ్లు ఉండేయి తెలుసునా. ఎర్రగడ్డల బుట్ట ఏలాడినట్టు కోడిగుడ్ల బుట్ట ఏలాడతా ఉండేది యింట్లో. తిన్నది తిన్నంత. పారేసింది పారేసినంత. పాపం. దైవం తోడురాక కొడుకుబుట్టిన పద్నాలుగేళ్లకి బర్తని పోగొట్టుకుంది. వాళ్లది ఎండ తగలని వొంశం నాయనా. అట్టాంటి వొంశం నుంచి వొచ్చి, మొగుడు పొయ్యాక మొగరాయుడిలాగా నిలబడి, కొడుకుని కడుపులో పెట్టుకొని సాక్కుంటా, ఇంత పెద్ద ఆస్తిని కాపాడుకుంటా ఈడదాకా తీసుకొని వచ్చింది. ఒక లోకం చూసింది లా. ఒక సుకం గమనించుకుందిలా. ఆమె అట్టా ఉండకుండా నీబోటోళ్లందరినీ యిళ్లల్లోకి దూరనిస్తా ఉంటే ఈ పాటికి ఏం మిగిలేది నాయనా. బూడిద' అని కతంతా చెప్పి, ఆఖరున అనాల్సినమాట మళ్లీ నన్నే అని వెళ్లింది మహాతల్లి.

అప్పుడు నాకర్దమైంది శ్రీదరు వాళ్ల నాన్నమ్మంటే అందరికీ ఎందుకంత హడలో.

అందుకనే ఆమె 'ఒరే ప్రబాకరా' అని కేకేస్తే శ్రీదరు వాళ్ల నాయన అటెన్షన్.

'ఒరే. శ్రీదరా' అని కేకేస్తే శ్రీదరుగాడు అటెన్షన్.

'ఒరే. కదీరుగా' అని కేకేస్తే ఏ సంబంధం లాకపోయినా ఉత్తిపుణ్యానికి నేను కూడా అటెన్షన్.

ఇప్పుడు కావలిలో ఉంది.

చూపు ఆనకపోయినా ఈ కత చదువుతుంది.

దేవుడా. అటెన్షన్.

■